క్లుప్తంగా

28,29 తేదీల్లో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు

అరకులోయ రూరల్: స్థానిక క్రీడా పాఠశాల ఆధ్వర్యంలో ఈనెల 28,29 తేదీల్లో రెండు రోజుల పాటు జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహించనున్నట్టు క్రీడా పాఠశాల ప్రిన్సిపాల్ పి.ఎస్.ఎన్. మూర్తి మంగళవారం తెలిపారు. బాలురు మాత్రమే పోటీలకు అర్హులని, జిల్లాలో అన్ని ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చని చెప్పారు. వివరాలకు 9701737424, 9177474231 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

మృతుని కుటుంబానికి బీమా చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎస్‌బీఐ మేనేజర్ నాగరాజు

వై.రామవరం: స్థానిక స్టేట్‌బ్యాంకు మేనేజర్ యు.నాగరాజు మంగళవారం లబ్ధిదారునికి రూ.2 లక్షలు బీమా చెక్కును అందజేశారు. మండలంలోని చామగడ్డ పంచాయతీ బండిగడ్డ గ్రామానికి చెందిన పల్లాల సోమి రెడ్డి(45) అనే గిరిజనుడు ఈఏడాది జూన్ 25న అనారోగ్యంతో మృతి చెందాడు. తమ బ్యాంకులో సోమిరెడ్డికి ఖాతా ఉండడంతో అతని భార్య పల్లాల దాయమ్మకు ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా పథకానికి సంబంధించిన రూ.2 లక్షల చెక్కును మేనేజర్ అందజేశారు. ఈకార్యక్రమంలో క్యాషియర్ బి.ఎస్. శ్రీనివాస్, క్లర్క్ ఎం.వీర్రాజు పాల్గొన్నారు.

టార్పాలిన్లు సద్వినియోగం చేసుకోవాలి



టార్పాలిన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ ముత్తమ్మ

కూనవరం: ప్రభుత్వం అందిస్తున్న టార్పాలిన్లు వరద బాధితులు సద్విని యోగం చేసుకోవాలని సర్పంచ్ సోందె ముత్తమ్మ తెలిపారు. ఇటీవల సంభవించిన వరదలకు పునరావాస కాలనీలను ఆశ్రయించిన మండల పరిధిలోని వెంకటాయపాలెం పంచాయతీ కూళ్లపాడు గ్రామంలో బాధితులకు మంగళవారం టార్పాలిన్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 140 కుటుంబాలకు వీటిని పంపిణీ చేసినట్టు చెప్పారు. ఈకార్యక్రమంలో మండల యూత్ కన్వీనర్ సోందె పాపారావు, వార్డు సభ్యులు నాంచారమ్మ, వీఆర్వో సుగుణ, సచివాలయం కన్వీనర్ జి.శ్రీను, స్వాతి, నాగేష్, ఎస్ శ్రీను, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు



ముంచంగిపుట్టులో బర్త్‌డే కేక్ కట్ చేస్తున్న చిరంజీవి అభిమానులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో మంగళవారం మెగాస్టార్ చిరంజీవి 68వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆంజనేయ స్వామి ఆలయంలో అభిమానులు ప్రత్యేక పూజలు,అభిషేకాలు జరిపించారు. బర్త్‌డే కేక్ కట్ చేసి, సందడి చేశారు. పెదగూడ సర్పంచ్ జి.బాబురావు, బి.బి.దామోదరం,ఆర్.శ్రావణ్‌కుమార్,ఎస్.రాంబాబు,ఎం.జగన్నాథం పడాల్,బి.ఇంద్ర తదితరులు పాల్గొన్నారు.

50 లీటర్ల పులుపు ధ్వంసం

రాజవొమ్మంగి : మండలంలోని వాతంగి పంచాయతీ, ఓగిపాలెం శివార్లలో సారా బట్టీపై దాడి చేసి 50 లీటర్ల పులుపును ధ్వంసం చేసి, ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్టు జడ్డంగి ఎస్‌ఐ రఘునాథరావు తెలిపారు. పది లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, నిందితుడిని అడ్డతీగల జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరు పరిచినట్టు ఎస్‌ఐ తెలిపారు.

నేడు పశువులకు టీకాలు

రోలుగుంట: స్థానిక పశువైద్య కేంద్ర వద్ద బుధవారం పశువులకు రోగ నిరోధక టీకాలు వేస్తామని పశువైద్యాధికారి నూకేశ్వర్రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తరాదిలో లంపీస్కిన్‌వ్యాధితో అధికంగా పశువులు మరణిస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో షెడ్యూల్ ప్రకారం గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటు చేసి చికిత్సలు అందిస్తున్నామన్నారు.

సంక్షేమం, ప్రగతిని చాటి చెప్పాలి

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



మద్దిగరువులో మహిళలకు బ్రోచరు అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

జి.మాడుగుల: సీఎం వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, రాష్ట్రంలో సాధించిన ప్రగతిని చాటిచెప్పాలని, వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డినే మళ్లీ రాష్ట్రముఖ్యమంత్రిని చేసుకునేందుకు ఐక్యంగా పనిచేయాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. మండలంలో బొయితిలి గ్రామ సచివాలయ పరిధిలోని దిగరాపల్లి,దిగరాపల్లి కాలనీ,జాములవీధి,జాములవీధి కాలనీ, మద్దిగరువు, బొయితిలి గ్రామాల్లో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో 260 గడపలను ఎమ్మెల్యే సందర్శించారు. గడపగడపలో ఎమ్మెల్యేకు గిరిజనులు సాదర స్వాగతం పలికారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని సచివాలయ అధికారులను ఆమె ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగున్నర ఏళ్ల కాలంలో బడుగు, బలహీన వర్గాల వారికి అందజేసిన సంక్షేమ ఫలాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని వైఎస్సార్‌సీపీ నాయకులను కోరారు. ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను చాటి చెప్పినప్పుడే విజయం సులభతరం అవుతుందని ఆమె తెలిపారు. ప్రభుత్వం పేదల పక్షాన నిలుస్తూ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు విద్య, ఆరోగ్య రంగాల అభివృద్ధికి కృషి చేస్తోందని చెప్పారు. గ్రామాల్లో సీసీరోడ్లు నిర్మించడంతో పాటు తాగునీరు, ఇతర సమస్యలు పరిష్కరించడంపై దృష్టి సారించినట్టు తెలిపారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్ర ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు ప్రతి కార్యకర్త శక్తివంచనలేకుండా కృషి చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లసంగి మాలన్న, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఎస్.మత్స్యకొండం నాయుడు, జి.మాడుగుల,లువ్వాసింగి, సొలభం ఎంపీటీసీలు మత్స్యరాస విజయకుమారి,గబ్బాడి సన్యాసిదొర, కె.చిన్నారావు, మండల సచివాలయ కన్వీనర్ ఎల్.కల్యాణం, ఎంపీడీవో చంద్రశేఖర్‌రావు,మాజీ సర్పంచ్ తమర్బ రాంబాబు, సచివాలయ కన్వీనర్లు సూర్యప్రకాష్‌నాయుడు, బి.బాలయ్యపడాల్, గావెల రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ సెంటర్లు

అడ్డతీగల: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామసచివాలయాల్లో మంగళవారం నుంచి ఈనెల 25 వరకూ ప్రత్యేక ఆధార్ సెంటర్లు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.బాపన్నదొర తెలిపారు. ధాన్యంపాలెం, వేటమామిడి, గొండోలు, వీరవరం, ఎల్లవరం గ్రామసచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆధార్ అప్‌డేట్‌తో పాటు మార్పులు,చేర్పులు వంటివి చేసుకోవచ్చని తెలిపారు.

చింతపల్లిరూరల్: మండలంలోని బెన్నవరం, గొందిపాకలు, కుడుమసారి, కొమ్మంగి పంచాయతీల్లో ప్రత్యేక ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో ఆశాజ్యోతి తెలిపారు. ఇవి శుక్రవారం కొనసాగుతాయన్నారు.వీటి సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

కొయ్యూరు: మండలంలోని ఆడాకుల,బకులూరు, బాలారం, డౌనూరు, మూలపేట, గదబపాలెం, చిట్టింపాడులలో ఈనెల 25 వరకు ప్రత్యేక ఆధార్ సెంటర్లు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో లాలం సీతయ్య మంగళవారం తెలిపారు.

నేడు గడపగడపకు మన ప్రభుత్వం

జి.మాడుగుల: బొయితిలి గ్రామ సచివాలయం పరిధిలోని ఎగమండిభ, దిగమండిభ,సుబ్బులు,తోకగరువు, పులుసుమామిడి గ్రామాల్లో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సుర్జని మత్స్యకొండం నాయుడు, లువ్వాసింగి ఎంపీటీసీ గబ్బాడి సన్యాసిదొర తెలిపారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆయా గ్రామాల్లో పర్యటిస్తారని చెప్పారు.

విద్యాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి



విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులను తల్లిదండ్రులకు అందజేస్తున్న ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి

నర్సీపట్నం: విద్యాభివృద్ధిలో విద్యార్థుల తల్లిదండ్రులు భాగస్వాములు కావాలని ఎంజేపీ బీసీ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.వెంకటరెడ్డి కోరారు. స్థానిక పాఠశాలలో 6, 7 తరగతులు విద్యార్థుల తల్లిదండ్రులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. గురుకులంలో అందుతున్న సౌకర్యాలు, విద్యా విధానంపై తల్లిదండ్రులను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యను బోధించడం, సౌకర్యాలు కల్పిస్తున్నప్పటికీ తల్లిదండ్రులూ తమ పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యార్థుల పట్టుదల, ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల సహకారంతో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించామన్నారు. అదే సహకారాన్ని కొనసాగించాలని కోరారు. అనంతరం విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులను తల్లిదండ్రులకు అందజేశారు. ఉపాధ్యాయులు సత్తిబాబు, సత్యనారాయణ, రజని, శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట



విగ్రహాలకు పూజాధికాలు నిర్వహిస్తున్న తణుకు వెంకటరామయ్య, విజయలక్ష్మి దంపతులు

అడ్డతీగల: మండలంలోని దాకోడులో మంగళవారం సీతారామ,లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపనమహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.అడ్డతీగల పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య, విజయలక్ష్మి దంపతులు ఈ కార్యక్రమాలను ఘనంగా జరిపారు.మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు



శిక్షణనుద్దేశించి మాట్లాడుతున్న ఏపీఎం సాధన

రోలుగుంట: బాకీల జమల ద్వారానే డ్వాక్రా సంఘాలుగాని, మన వ్యవస్థగాని బలోపేతమవుతాయని వెలుగు ఏపీఎం కె.సాధన తెలిపారు. స్థానిక స్త్రీశక్తి భవన్‌లో మండల, గ్రామ స్థాయి సామాజిక కార్యకర్తలకు సంఘాలు బలోపేతం, వ్యవస్థ అభివృద్ధిపై సోమవారం ప్రారంభమైన శిక్షణ తరగతులు మంగళవారం విజయవంతంగా ముగిశాయి. ఈ శిక్షణలో సంఘాలకు నిధుల ఎలా వస్తాయి, వాటి వినియోగంపై వెలుగు ఏపీఎం అవగాహన కల్పించారు. గ్రామాఖ్య సంఘాలకు పొదుపు, సభ్యత్వం, సేవా రుసుం, అంతర్గత అప్పులపై వడ్డీ రూపంలోను, బ్యాంకు ఖాతాపై వచ్చే వడ్డీ, పలు రకాలుగా వచ్చే నిధుల వినియోగంపై వివరించారు. రుణాలు శతశాతం జమ చేయడంలో గ్రామాఖ్య, మండల మహిళా సమాఖ్య సంఘాల ప్రతినిధులు కృషి చేయాలని సూచించారు. ఆడిట్ అంశాలపైన అవగాహన కల్పించారు. ప్రాంతీయ సామాజిక ప్రతినిధులు జి.పద్మ, వి.పరమేష్, ఎస్. నాగేశ్వరరావు, వై.భవానీ, అకౌంటెంట్ ప్రవల్లిక పాల్గొన్నారు.

రోగులకు సంతృప్తికరంగా వైద్య సేవలు


చౌడువాడ పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎంపీపీ జగన్‌మోహన్



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ జగన్‌మోహన్, అధికారులు

కె.కోటపాడు: పీహెచ్‌సీకి వచ్చే ప్రతి రోగికి సంతృప్తికరంగా వైద్య సేవలందించాలని ఎంపీపీ రెడ్డి జగన్ మోహన్ సూచించారు. ఆయన అధ్యక్షతన మంగళవారం చౌడువాడ పీహెచ్‌సీకి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో వైద్య సిబ్బందికి అవసరమైన మౌలిక వసతుల వివరాలను వైద్యాధికారి నిర్మలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి పరిసరాల్లో పరిశుభ్రతతో పాటు పచ్చదనంతో ఉండేటట్లు తీర్చిదిద్దాలని సిబ్బందికి సూచించారు. నూతనంగా రూ.1.70 కోట్లతో నిర్మించిన భవనంలో ప్రసవాలు, కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేస్తున్నట్లు వైద్యాధికారి వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.రమేష్ బాబు, ఎంపీడీవో కె.శచీదేవి, సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, ఆస్పత్రి కమిటీ సభ్యులు బండారు కనక మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

డి.పట్టాదారులకు జిరాయితీ హక్కు



తహసీల్దార్ శ్రీనివాస్‌నాయుడు

నాతవరం: ప్రభుత్వం 20 ఏళ్లు దాటిన డి.పట్టా భూములను జిరాయితీగా మార్పు చేస్తుందని తహసీల్దార్ ఎస్.ఎస్.వి.శ్రీనివాస్‌నాయుడు తెలిపారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో సిబ్బందితో అత్యవసర సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2003 జూన్ 30వ తేదీకి ముందు అసైన్డ్ భూములకు డి.పట్టా పొంది సాగు చేసుకుంటున్న రైతులకు రిజిస్ట్రేషన్ చేసుకునే హక్కు ప్రభుత్వం కల్పించిందన్నారు. డి.పట్టా పొందిభూముల్లో సాగు చేయకపోతే మార్పు చేయడానికి కుదరదన్నారు. మండలంలో డి.పట్టాదారులంతా వీఆర్వోలకు జెరాక్సు కాపీలు అందజేయాలన్నారు. కోర్టు తగాదాలు, వివాదాస్పదంగా ఉన్న డి.పట్టా భూములను జిరాయితీగా చేయడం కుదరదన్నారు. ఈ విషయమై గ్రామాల్లో దండోరా వేయించాలని వీఆర్వోలను ఆదేశించామన్నారు. పైసా ఖర్చు లేకుండా డి.పట్టా భూములు జిరాయితీగా చేస్తామన్నారు.

కార్యకర్త, ఆయా పోస్టులకు దరఖాస్తులు



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీవో శ్రీగౌరి

నాతవరం: వెదురుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త, ఆయా పోస్టులకు అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని గొలుగొండ ఐసీడీఎస్ పీవో కె.శ్రీగౌరి మంగళవారం తెలిపారు. ఈ పోస్టుల తోపాటు గుమ్మడిగొండ అంగన్‌వాడీ కేంద్రం ఆయా పోస్టు జనరల్ కేటగిరీకి కేటాయించామన్నారు. ఈ నెల 23 నుంచి 29వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు గొలుగొండ ప్రాజెక్టు కార్యాలయానికి దరఖాస్తులు అందజేయాలన్నారు. అభ్యర్థులు ఈ ఏడాది జూలై ఒకటో తేదీకి 21 ఏళ్లు నిండి 35 ఏళ్ల లోపు వారు అర్హులన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 18 ఏళ్లు నిండి ఉండాలన్నారు. ఆమె వెంట సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, జ్యోతి ఉన్నారు.

గిరిజన సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం



సంతవీధిలో గిరిజనులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జున్

ముంచంగిపుట్టు: గిరిజన సంక్షేమమే లక్ష్యంగా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి మల్లికార్జున్ అన్నారు. మండలంలో గల భూసిపుట్టు పంచాయతీ సరియాపల్లి, కమ్మరిగొయ్యి, సంతవీధి గ్రామాల్లో మంగళవారం వైఎస్సార్‌సీపీ నేతలు పర్యటించారు. సంక్షేమ పథకాలు అమలు తీరుపై ఆరా తీశారు. ఆయా గ్రామస్తులను అడిగి సమస్యలు తెలుసుకున్నా రు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ తమ ప్రభుత్వ హయాంలో గిరిజన ప్రాంతంలో రవాణా వ్యవస్థ, మౌలిక సదుపాయాలు మెరుగుపడ్డాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు రాజమ్మ, రమేష్, మండల నేతలు జగబంధు, కొండలరావు, జగన్నాథం, నాగేశ్వరరావు, మంగ్లన్న తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనకు సహకరించాలి



జి.మాడుగులలో కళాజాత నిర్వహిస్తున్న కళాకారులు

జి.మాడుగుల: గంజాయి పంట వద్దు ప్రత్యామ్నా య పంటలే ముద్దని ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. స్థానిక మూడు రోడ్ల జంక్షన్ వద్ద మంగళవారం కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయిని పూర్తిగా నిర్మూలించేందు కు ఈ ప్రాంత ప్రజలు, ప్రజాప్రతినిధులు పోలీసు లకు సహకరించాలని కోరారు. గంజాయి సాగు, రవాణా, విక్రయాలు చేస్తూ పట్టుబడి జైలుకు వెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దని ఆయన సూచించారు. గంజాయి వల్ల కలిగే అనర్థాల గురించి కళాజాత ప్రదర్శనలో కళాకారులు వివరించారు.

ఓటర్ల సర్వే వేగవంతం



మాట్లాడుతున్న తహసీల్దార్ నాగమ్మ

డుంబ్రిగుడ: ఓటర్ల సర్వేను వేగవంతం చేయాలని తహసీల్దార్ నాగమ్మ తెలిపారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం బీఎల్‌వోలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సర్వేను పక్కాగా నిర్వహించాలన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రెండు రోజుల్లో పూర్తి వివరాలను తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ముజీబ్,ఆర్ఐ హరి తదితరులు పాల్గొన్నారు.



బీఎల్‌వోలకు సూచనలు ఇస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

వై.రామవరం: ఇంటింటా ఓటర్ల సర్వేను వేగవంతంగా చేయాలని తహసీల్దార్ సీహెచ్ శ్రీనివాసరావు బీఎల్‌వోలకు సూచించారు. వై.రామవరంలో నిర్వహిస్తున్న ఓటర్ల సర్వేను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ సభ్యుల్లో ఏ ఒక్కరినీ విడిచిపెట్టకుండా అందరి వివరాలు నమోదు చేయాలన్నారు.

నాణ్యతా ప్రమాణాలపై అవగాహన అవసరం



ఇంజినీరింగ్ అసిసెంట్లకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

చింతపల్లి: గ్రామాల్లో జరుగుతున్న ప్రభుత్వ నిర్మాణాల నాణ్యతా ప్రమాణాలపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు తప్పని సరిగా అవగాహన ఉండాలని జిల్లా విజిలెన్స్ అండ్ క్యూసీ డీఈ శ్రీనివాస్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో చింతపల్లి,గూడెంకొత్తవీధి, కొయ్యూరు మండలాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో క్యూసీ ఏఈ కాంతరాజు, చింతపల్లి,గూడెంకొత్తవీధి మండలాల జేఈలు బాలకిశోర్,జ్యోతిబాబు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



చెరువులో గంబూషియా చేప పిల్లలను విడుదల చేస్తున్న సర్పంచ్ శారద



గంబూషియా చేపపిల్లలు అందజేస్తున్న వైద్యులు



జి.మాడుగులలో గంబూషియా చేపపిల్లలను వేస్తున్న డాక్టర్లు శశికాంత్, రవిచంద్రశేఖర్

డుంబ్రిగుడ: దోమల నివారణకు చర్యలు చేపట్టినట్టు వైద్యాధికారి కె.కరుణ తెలిపారు. అరకు సర్పంచ్ జి.శారద ఆధ్వర్యంలో అరకు సంతబయలు గ్రామంలోని చెరువులో మంగళవారం 50 గంబూషియా చేప పిల్లలను విడిచిపెట్టారు. ఈ సందర్భంగా కరణ మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందకుండా ఈ చేపలను నీటి గుంటలు, చెరువుల్లో విడిచిపెడుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది దోయిమొత్తి, అప్పలరాజు పాల్గొన్నారు.

జి.మాడుగుల: దోమల నివారణకు మండలంలో తొమ్మిది సచివాలయాల పరిధిలోని చెరువుల్లో మంగళవారం గంబూషియా చేపలను విడిచిపెట్టారు. కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ శశికాంత్,డాక్టర్ రవిచంద్రశేఖర్ వీటిని విడిచిపెట్టారు. స్థానిక గురుకుల పాఠశాల వద్ద కాలువలోను, జీసీసీ పెట్రోల్‌బంక్ వద్ద చెరువులోను గంబూసియా చేపలను వేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో ఎస్.ప్రకాష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తం

చింతపల్లి: దోమల వల్ల ప్రబలే వ్యాధుల పట్ల గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని లోతుగెడ్డ, కోరుకొండ పీహెచ్‌సీ వైద్యాధికారులు లక్ష్మీకాంత్, జానకి అన్నారు. దోమల వ్యాప్తి నివారణ చర్యల్లో భాగంగా మంగళవారం అన్నవరం సచివాలయం పరిధిలోని పలుగ్రామాల్లో గంబూషియా చేప పిల్లలను నీటి నిల్వ ఉన్న ప్రదేశాలలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమల గుడ్లు ఈ చేపలు నాశనం చేయడం వల్ల వాటి నివారణకు అవకాశం కలుగుతుందన్నారు. గిరిజనులు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నర్సీపట్నం తహసీల్దార్‌గా రవికుమార్



నర్సీపట్నం: స్థానిక తహసీల్దార్ బి.రవికుమార్ మంగళవారం బాధ్యత లు చేపట్టారు. అమరావతి సచివాలయంలో సెక్షన్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆయన్ను ఇక్కడ తహసీ ల్దార్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రస్తుత ఇన్‌చార్జి తహసీల్దార్ అన్నాజీరావు నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు తహసీల్దార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పౌష్టికాహారం, నోట్‌పుస్తకాలను పంపిణీ చేస్తున్న సమిధ సంస్థ సభ్యులు

అనంతగిరి: మండలంలోని బోండ్యగుడ, కొత్తవలస, కరాయిగుడ, లక్ష్మీపురం, మర్ధగుడ, భీసుపురం, కితలంగి, కమలపురం పాఠశాలల్లో గల 450మంది విద్యార్థులకు మంగళవారం సమిధ సంస్థ ఆధ్వర్యంలో నోట్‌పుస్తకాలు, పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో సంస్థ కార్యదర్శి వీరభద్రరావు మాట్లాడుతూ.. అమెరికా బైబిల్ టబర్నకల్ చర్చ్ వారి సహకారంతో వీటిని పంపిణీ చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలోని సంస్థ సభ్యులు బుద్ధరాజు, సింహాద్రి, అప్పలరాజు, కృష్ణ, దేముడమ్మ, కాసులమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదుపై అవగాహన తప్పనిసరి



కొంతలంలో అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ ఇన్‌చార్జి దేవి

రోలుగుంట: పంటల ఈ-క్రాప్ నమోదుపై సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని నర్సీపట్నం డివిజన్ ప్రకృతి వ్యవసాయశాఖ ఇన్‌చార్జి బి.దేవి అన్నారు. రోలుగుంట మండలం ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్న ఆమెకు ఉన్నతాధికారులు నర్సీపట్నం డివిజన్ ఇన్‌చార్జి బాధ్యతలనూ అప్పగించారు. మంగళవారం కొంతలంలో ఇక్కడ సిబ్బందికి ఈ-క్రాప్ నమో దుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యాప్‌లో ప్రకృతి వ్యవసాయ రైతుల డేటా ఏవిధంగా అప్‌లోడ్ చేయాలో వివరించా రు. అనంతరం క్షేత్రస్థాయిలో సిబ్బంది మోదినాయుడు, నిర్మలతో కలసి పంటలను పరిశీలించారు.